

# అమెరి'కా'లేజ్

## – లిపి మల్లాది



*అమెరికాలో కాలేజీ చదువంటే ఒకప్పుడు గగనకుసుమం, అదో ఇంద్రజాలం. గత రెండు, మూడు దశాబ్దాల్లో అమెరికాలో చదువుకోసం వస్తున్న విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడమే కాక, ఇండియాలో కూడా ఒక మాదిరిగా చదువుకున్న కుటుంబాల్లో దాదాపు ప్రతి ఇంటికీ కనీసం ఒకరైనా అమెరికాలో చదువుకుంటున్న పిల్లలుంటున్నారు. ఇంటర్నెట్ అరచేతిలోకొచ్చేసిన ఈ రోజుల్లో అమెరికాలో కాలేజీలు ఎలా ఉంటాయో, అక్కడ డార్మ్స్ ఎలా ఉంటాయి, స్టూడెంట్స్ జీవితాలు ఎలా ఉంటాయో... అనే విశేషాలు అతి సులువుగా తెలిసిపోతున్నట్లనిపిస్తున్నాయి. ఐనా మొదటిసారి చదువుకోసం అమెరికా వచ్చే ప్రతి విద్యార్థికీ ఎవరి అనుభవం వారిదే, ఎవరి ఇబ్బందులు వారివే, ఎవరి స్నేహాలు వారివే. ఈ నేపథ్యంలో అమెరికాలో చదుకోసం వచ్చిన ఓ సాధారణ మధ్యతరగతి అమ్మాయికి ఎదురైన సంఘటనలు, సన్నివేశాలు.. స్నేహాలు, సంతోషాలు.. సరదాలు.. వెరసి ఇవన్నీ అమెరికాలేజీ కథలు. స్వానుభవాలనూ, విన్న అనుభవాలనూ, చూసిన అనుభవాలనూ – ఆసక్తికరమైన ధారావాహికగా కౌముది పాఠకులకు అందిస్తున్నది లిపి మల్లాది. 'నా కళ్ళతో నాన్న' ధారావాహికతో కౌముది పాఠకుల అభిమానాన్ని సొంతం చేసుకున్న లిపి మల్లాది ఈ ధారావాహికతో మీకు మరింత చేరువౌతుందని ఆశిస్తూ..*

– సంపాదకుడు

(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)

"**అన్నయ్యా,** నాకు ఫోటో తీస్తావా?" మాల్ వైపుగా నడుస్తున్నప్పుడు అడిగాను.

"ఎక్కడ?" పరధ్యానంగా అడిగాడు.

"మాల్‌లో"

"మాల్ లోనా?" ఆశ్చర్యపోయాడు.

"ఔను"

"దేనికి?" కోపంగా అడిగాడు.

"ఊరికే"

"ఊరికేనా?" అసహనం స్పష్టంగా తెలిసింది.

"ఔను. అందరూ తీసుకుంటారు కదా"

"అందరూ బావిలో దూకితే నువ్వూ దూకుతావా? అయినా షాపింగ్ మాల్‌లో ఫోటో ఏంటి?"

బుంగమూతి పెట్టి బదులివ్వలేదు. మరీ టూ మచ్ కాకపోతే ఒక్క ఫోటో తీయడానికి ఏమైందట? నేనేమన్నా చంద్రమండలంకి తీసుకెళ్ళి ఫొటో తియ్యమన్నానా లేక కెమేరాకి రీల్ కొనాలా? ఆలోచనలు వినబడ్డాయేమో..

"ఈ ఫౌంటెన్ పక్కన నిలబడు" గంభీరంగా అన్నాడు.

"దేనికి?" చిరాకుపడ్డాను.

"ఫోటో అడిగావు కదా. గోడముందు, బట్టలముందుకన్నా, ఫౌంటెన్ ముందు బెటర్"

అలిగినట్టు నటిస్తూ ఫౌంటెన్ పక్కన నిలబడ్డాను.

"కాస్త నవ్వు" అన్నాడు.

ఇంకా కోపంగా చూసాను.

"సరే. ఒక ఫోటో తీసాను. వెళదామా లోపలికి?" ఎగతాళిగా అడిగాడు.

"ఆగు.. ఆగు" నవ్వుతూ పోజ్ ఇచ్చాను.

లోపలికి నడుస్తూ "లిస్ట్ రాసావా?" అడిగాడు.

"ఆс. రాసాను. నా ఫ్రెండ్ కూడా హెల్ప్ చేసింది."

"ఫ్రెండా?" అయోమయంగా అడిగాడు.

"త్రివేణికి పొద్దున ఫోన్ చేసాను. తను ఏం ఏం కొనుక్కోవాలో చెప్పింది"

"సరే. ఫస్ట్ వింటర్‌వేర్ కొందాం. తరవాత మిగిలినవి తీసుకుందాం. అది అన్నిటికన్నా ఇంపార్టెంట్."

"సరే" ఒక షాపులోకి నడిచాము.

"మీకు అక్కడ చలి బాగా ఉంటుంది. ఇంచుమించు మాలాగే. ఒక మంచి వింటర్ జాకెట్ కొంటే కొన్నేళ్ళ వరకు వస్తుంది"

లిస్ట్ తెరిచి "ఒక బ్లాక్ కలర్, ఒక వైట్ కలర్, ఇంకా ఒక బ్లూ కలర్ జాకెట్స్ కావాలి" అన్నాను.

కళ్ళు పెద్దవి చేసి ఆశ్చర్యపోతూ "అన్నెందుకు?" అడిగాడు.

"నా బట్టలకి మేచింగ్ ఉండాలి కదా"

"బ్లాక్ తీసుకుంటే సరి. అన్నిటికీ సరిపోతుంది"

సరే అన్నట్టు తలుపాను. అన్నయ్య ఐదునిమిషాల్లో కొన్ని జాకెట్లు చూసి నా చేతికి ఒక మూడిచ్చి "ఇవి వేసుకుని ఏది సరిపోతుందో చూడు" అన్నాడు.

"ఇవన్నీ మీడియం సైజ్. నాది స్మాల్"

"నువ్వు స్వెటర్ వేసుకుని ఉంటావు కదా. కొంచెం లూజ్ ఉండాలి. లేకపోతే మరీ టైట్ అయి జిప్ పట్టకపోవచ్చు."

"ఈ మూడూ చూడ్డానికి ఒకేలా ఉన్నాయి. నీ ఇష్టం. నీకేం నచ్చితే అదే తీసుకుంటా"

"వాటిల్లో అన్నిటికన్నా ఏది ఎక్కువ సాఫ్ట్‌గా, వెచ్చగా వుందో అది తీసుకో. రోజూ చలిలో వేసుకోవాల్సివస్తుంది."

సరే అని మూడిట్లోంచి ఒకటి అన్నయ్య చేతికిచ్చాను.

"ఇంత పెద్దది కాకుండా మాములు జాకెట్‌లు కూడా ఒక రెండు కావాలి" లిస్ట్ చూస్తూ చెప్పాను.

"అవి కూడా రెండక్కర్లేదు. ఒకటి సరిపోతుంది" అలాంటివి ఉన్న వైపుకి నడిచాము.

"ఈ బ్లూ ఎలా ఉంది?" చేతికందిస్తూ అడిగాడు.

"బావుంది."

ఆ రెండూ తీసుకుని బూట్లు కొనడానికి మరో షాపులోకి వెళ్ళాము.

"చూసుకో ఏం నచ్చుతాయో" కదలకుండా నుంచున్నాడు. ఎటువైపుకి వెళ్ళాలో, ఎక్కడ మొదలుపెట్టాలో తెలియక వంకరటింకరగా నడవడం చూసాడు.

"మోకాలి వరకు ఉన్నవి బెస్ట్. చలిని ఎక్కువ ఆపుతాయి" అంటూ పొడవాటి బూట్లున్న చోటుకి నడిచాడు.

ఎంతో అందంగా తెల్లటి ముత్యాలున్న ఒక జతని చేతిలోకి తీసుకుని "ఇవి బావున్నాయి కదా" అన్నాను.

"ఆ హీల్ చూసావా?"

అప్పటిదాకా గమనించని నాలుగంగుళాల హీల్ చూసి ఆశ్చర్యపోయాను. చుట్టుపక్కల చూస్తే చాలావాటికి దాదాపు అంతే హీల్ ఉన్న బూట్లు ఎక్కువున్నాయి.

"పెద్ద హీల్ ఉంటే స్నోలో జారతావు. సీరియస్ ఇన్‌జురీస్ అవుతాయి" అంటూ బ్రౌన్ రంగులో హీల్ తక్కువగా వున్న జత నా చేతికిచ్చాడు."ఇవి కూడా ఒక్క జత సరిపోతాయా?"

"సరిపోతాయి" నవ్వాడు.

"అయితే బ్లాక్ కలర్ తీసుకుందాం" అంటూ కొన్ని జతలు వేసుకుని నడిచి చూసాను.

వాటిల్లోంచి ఒకటి అన్నయ్య చేతికిచ్చాను. ఇంతలో నాకు కుతూహలం పెరిగి, "అన్నయ్య, ఒకసారి ఆ పెద్ద హీల్స్ వేసుకుని చూస్తాను" అంటూ ఒక జత తొడుక్కున్నాను. సినిమాల్లో చూపించినట్టే ఒక రెండడుగులు వేయగానే దాదాపు కిందపడబోయాను. వెంటనే అన్నయ్య సహాయంతో నెమ్మదిగా కూర్చుని ఒక్క క్షణం ఆలోచించకుండా ఆ బూట్లు విప్పేసాను. అదృష్టవశాత్తు అన్నయ్య తప్ప ఎవరూ నవ్వలేదు. మరో మాట మాట్లాడకుండా బిల్లు చెల్లించమన్నాను.

"ఇప్పుడు నీకు కావాల్సినవి చెప్పు. కొందాం" షాపునుండి బయటికి వస్తుండగా అన్నాడు.

"షర్ట్స్, బాగ్స్, పోగులు కావాలి" లిస్ట్ చూస్తూ చెప్పాను.

"అన్నీ బహువచనాలే?"

ఏమీ మాట్లాడలేదు.

"కాలేజ్‌కేనా?" మరో ప్రశ్న అడిగాడు.

"ఔను" కోపంగా బదులిచ్చాను.

"లాస్ట్ టైం నేను ఇండియాకి వచ్చినప్పుడు తెచ్చిన బట్టలేమీ తీసుకురాలేదా?"

"తెచ్చాను. కానీ రోజూ వేసుకోవాలి కదా" సమర్ధించుకున్నాను.

"సర్లే. మంచివి ఉంటే రెండు మూడు కొనుక్కో."

"పార్టీవేర్ కూడా కావాలి"

"పార్టీ వేరా? ఒసేయ్, నువ్వు చదువుకోవడానికి వచ్చావు"

"అంటే ఒక వేళ ఎప్పుడైనా వెళ్ళాల్సొస్తే ఉంటుందని"

"చూద్దాం" ఇష్టం లేకుండా ఒప్పుకున్నాడని అర్ధమైంది.

కాసేపు నిశబ్దం తరువాత "నీకు ఫార్మల్ డ్రస్ కూడా ఒకటి తీసుకుందాం. అవసరం వస్తుంది. కానీ రెండు మూడు అక్కర్లేదు. ఉద్యోగం వచ్చాక ఇంకొన్ని కొనుక్కోవచ్చు"

అక్కడ మేనికెన్‌కి వేసి ఉన్న డ్రస్ చుసి "అన్నయ్యా ఇది బాగుంది ట్రై చెయ్యనా?" కళ్ళు విప్పారించి అడిగాను.

"అంత పొడుగుదా? అవి ఫార్మల్ పార్టీలకి వేసుకుంటార్. వేరే మంచిది చూద్దాం."

మరో మేనికెన్‌కి వేసిన షర్ట్ చూపించి "ఇది?" అడిగాను.

ప్రైస్ టాగ్ చూపించి "నీ షాపింగ్ మొత్తం నూటయాభై డాలర్లలోపు చెయ్యి. స్టూడెంట్‌కి అంతకన్నా ఎక్కువ అవసరం ఉండదు. సేల్‌లో ఉన్నవి చూస్తే బెటర్. సూట్‌కేస్‌లో ప్లేస్ గురించి కూడా ఆలోచించు"

అన్నయ్య సలహా తీసుకుని నూటపది డాలర్లకే నా షాపింగ్ పూర్తిచేసాను.

"చూసావా? ఇంకా 40 డాలర్స్ మిగిల్చాను" బడాయిపోయాను.

"పద నీకొక ఫార్మల్ వేర్ తీసుకుందాం. ప్రెసెన్‌టేషన్స్‌కి, కెరీర్ ఫెయిర్స్‌కి, ఇంటర్వ్యూస్‌కి పనికొస్తుంది" అన్నాడు.

నాలాగాకా కాక అన్నయ్య ఫటఫటా అన్నీ చూసి ఒక డ్రస్ నా చేతికిచ్చి ట్రై చెయ్యమన్నాడు. భుజాలకి పెట్టి చూస్తే మోకాలి వరకు కూడాలేదా. "చాలా పొట్టిగా ఉంది" అన్నాను.

"పొట్టిగానా? ఏదీ నన్ను చూడనీ" రెండుక్షణాలు పరిశీలించి "బానే ఉందిగా?" అడిగాడు.

"నేను ఇంత పొట్టివి వేసుకోను"

"మరీ పొట్టిగా ఉంటే నేనే కొని పెట్టను. ట్రై చేసి చూడు"

అన్నయ్య మాట విని ట్రయల్ రూంలోకి వెళ్ళాను. నేను అన్నట్లుగానే మరీ పొట్టిగా ఉంది. బట్టలు మార్చుకుని అన్నయ్యకి ఆ సంగతి చెప్పాను. మరో రెండు డ్రసులిచ్చి ట్రై చెయ్యమన్నాడు. ఒకటి పొట్టి, మరోది పొట్టితో పాటు టైట్‌గా ఉంది. ఓపికగా మరోది నా చేతికిచ్చాడు. అది మరీ లూజ్ అయ్యింది.

"అసలెందుకు ఏదీ సరిపోవట్లేదు? ఇందాకటి వరకు బానే దొరికాయికదా" అసహనంగా అడిగాడు.

"ఏమో మరి? తరువాత ఎప్పుడైనా తీసుకుందాం. బయల్దేరుదామా?"

"తరువాత అంటే టైం లేదింకా. మనం మళ్ళీ షాపింగ్‌కి రాము. ఇప్పుడు తీసేసుకుంటే పని అయిపోతుంది."

"సరే వేరే షాపులో చూద్దామా?"

"ఎక్కడైనా ఇదే ప్రాబ్లం వస్తుంది. ఇన్నిసార్లు డ్రస్సు ట్రై చేసి నీకు చిరాకుగా ఉందని నాకు తెలుసు. కానీ ఒక్కసారి ఇది వేసుకో" చేతికి అందించాడు.

నేను లోపలికి వెళుతుండగా "వేసుకుని నాకు చూపించు" అన్నాడు. వేసుకుని చూస్తే మోకాలి వరకు కూడా లేదు. అది వేసుకుని బయటికి రావాలంటే బాగా ఇబ్బందిగా అనిపించింది. వేళ్ళతో కిందకి ఎన్నిసార్లు లాగినా మోకాలిని చేరలేదు. ఎంతసేపు ప్రయత్నించానో తెలీదు కానీ "ఏమైంది?" అన్నయ్య గొంతు వినిపించింది.

"ఇదీ పొట్టిగా ఉంది" ఏడుపు గొంతుతో బదులిచ్చాను.

" నేను తప్ప ఎవరూ లేరు. బయటికిరా" ప్రోత్సహించాడు.

చాలా ఇబ్బంది పడుతూ నిమిషానికో అడుగు వేస్తూ బయటకి నడిచాను.

"పర్‌ఫెక్ట్"

"పొట్టిగా ఉంది" విసుక్కున్నాను.

"పొట్టిగా కాదు. సరిగ్గా ఉంది"

"మోకాలి వరకు కూడా లేదు"

"మోకాలిని తాకీ తాకకుండా ఉంది. మరీ అంత పొట్టిగా కూడా లేదు"

"ఇది వేసుకుని బయటకి వెళ్ళాలా?" కోప్పడ్డాను.

"ఇక్కడ కొన్ని రోజులున్నాక నీకే అర్ధమౌతుంది. ఇది కరెక్ట్ లెంత్ ఫార్మల్‌కి" ఇంక నా మాట వినడని అర్ధమై సరే అన్నాను. నేను వేసుకుంటానో లేదో అన్నయ్యకి తెలిసే ఆస్కారం లేదు. కొని సూట్‌కేస్‌లో పడేస్తే పోతుంది అనుకుంటూ బిల్లింగ్ పూర్తయ్యాక అన్నయ్యతో కలిసి మాల్ నుండి బయటకి నడిచాను.

"నేను ఇచ్చిన ప్రతీది అంతే పొడుగున్నాయా లేక నిజంగానే పొట్టయ్యాయా?"

"ఇంచుమించు అంతే ఉన్నాయి"

"అంటే సరిగ్గా సరిపోయాయన్నమాట. బారిష్టర్ పార్వతీశంగారు నీ వల్ల నేను జీవితంలో చూడాల్సినన్ని అమ్మాయిల బట్టలు ఒకే రోజులో చూసాను"

ఇద్దరం నవ్వుతూ కారెక్కాము.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Click here to share your comments on this story